సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 17 । ఆగస్టు । 2025



మహిళలను ఏమార్చిన బాబు

సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేయకుండా మహిళలను ఏమార్చారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు విమర్శించారు. -8లో



ఆరా తరహాలో డీటీఈ యాప్ క్లోజ్!

ఆరా ఎర్నింగ్ యాప్‌తో ఇటీవల వేలమంది మోసపోయారు. ఆరా తరహాలో ఉన్న డీటీఈ ఎర్నింగ్ యాప్ క్లోజ్ అయినట్లు వెలుగులోకి వచ్చింది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.4/24.2

జిల్లాలో శనివారం 24.2 – 33.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో జోరు వర్షం

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. శనివారం తెల్లవారుజాము నుంచి జిల్లాలో పలు మండలాల్లో వర్షాలు కురిశాయి. ఇందులో భాగంగా దువ్వూరులో అత్యధికంగా 32.6 మి.మీ వర్షం కురిసింది. అలాగే రాజుపాలెంలో 30, కొండాపురంలో 28.2, ఖాజీపేట, మైలవరంలలో 23.6, బి.మఠంలో 19.8, ప్రొద్దుటూరులో 19, జమ్మలమడుగులో 16.4, చాపాడులో 15.6 , మైదుకూరులో 15, బద్వేల్‌లో 14.2 ,పోరుమామిళ్ల 12.2, ఎర్రగుంట్లలో 11.8, చెన్నూరులో 11, బి.కోడూరులో 10.6, అట్లూరులో 9.8, వల్లూరు, మైదుకూరు, ముద్దనూరులలో 8.4, పెద్దముడియంలో 7.4 , గోపవరంలో 6.4 , సిద్దవటంలో 6.2, కడపలో 4.4 ,కమలాపురంలో 3.8, ఒంటిమిట్టలో 2.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

నేడు 'తిరుపతి-సికింద్రాబాద్' ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆదివారం రాత్రి తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలు నడుపుతున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఆదివారం రాత్రి 9.10 గంటలకు ఈ రైలు (07097) తిరుపతిలో బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, యాదగిరి, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట మీదుగా సికింద్రాబాద్‌కు ఉదయం 10.00 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి ఇదే రైలు (07098) సికింద్రాబాదులో సోమవారం సాయంత్రం 5.50 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో తిరుపతికి మరుసటిరోజు ఉదయం 7.30 గంటలకు చేరుతుందన్నారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించారని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏపీఎస్‌పీడీసీఎల్‌లో జిల్లాకు ప్రథమ స్థానం



ఏపీఎస్‌పీడీసీఎల్ ఎండీ సంతోషరావు నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఈ రమణ


కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంతం పంపిణీ సంస్థ(ఏపీఎస్‌పీడీసీఎల్) పరిధిలోని 10 జిల్లాలలో వివిధ అంశాలలో వైఎస్సార్ కడప జిల్లా అత్యుత్తమ ప్రగతిని కనబరించి ప్రథమ స్థానం సాధించింది. శుక్రవారం తిరుపతిలోని కార్పొరేట్ ఆఫీసులో జరిగిన 79వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ఆ సంస్థ ఎండీ కె. సంతోషరావు చేతుల మీదుగా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ ప్రశంసా పత్రం అందుకున్నారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రకటించిన ఉత్తమ జిల్లా అధికారుల జాబితాలో కూడా ఎస్ఈ రమణకు చోటు లభించింది.

ఆరుతడి.. సాగు తడబడి!

- ఈ సారి ఖరీఫ్‌లో పడిపోయిన ఆరుతడి పంటల సాగు
- భారీగా తగ్గిన వేరుశనగ సాగు
- ముందుకు సాగని సోయాబీన్..
- మినుము కాస్త ఆశాజనకం
- వేరుశనగ, సోయాబీన్, మినుముసాగుకు ముగిసిన సీజన్
- పత్తికి ఈ నెలాఖరు వరకు అవకాశం




దువ్వూరు ప్రాంతంలో సాగులో ఉన్న మినుముపంట



కడప అగ్రికల్చర్: ఈ ఏడాది ఆరుతడి పంటల సాగుకు ఖరీఫ్ సీజన్ కలిసిరాలేదు. సీజన్‌కు ముందే వరుణుడు పలకరించినా సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ముఖం చాటేశాడు. దీంతో అనుకున్న మేర జిల్లాలో ఆరుతడి పంటల సాగు కాలేదు. మరో 45 రోజుల్లో ఖరీఫ్ సీజన్ కూడా ముగియనుంది. ముఖ్యంగా ప్రధానమైన ఆరుతడి పంటలకు సంబంధించిన వేరుశనగ, మినుము, సోయాబీన్ సాగుకు ఆగస్టు 15వ తేదీతో సీజన్ ముగిసింది. కాకపోతే నల్లరేగడి నేలల్లో ఏ పంట సాగు చేయడానికి కుదరకపోతే తప్పని పరిస్థితుల్లో మాత్రమే మినుము పంటను సాగు చేసుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. నల్లరేగడి నేలల్లో ప్రస్తుతం పత్తి, కంది, ఆముదం పంటలను సాగు చేసుకునేందుకు అనుకూలమని తెలిపారు. ఎర్రరేగడి నేలల్లో మాత్రం కంది, ఆముదం, అలసందను సాగు చేసుకోవచ్చని తెలిపారు.

దెబ్బతీసిన జూలై వర్షాలు....

సాధారణంగా ఖరీఫ్‌లో వేరుశనగ, కంది, మినుము, సోయాబీన్, పత్తి, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలు విత్తుకునేందుకు జులై నెల నుంచి అదును, జులైలోలోనే వరుణుడు ముఖం చాటేయడంతో ఖరీఫ్ ఏరువాక సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. జూన్ నెలలో సాధారణ వర్షం 68.2 మి.మీ కాగా 2.8 మి.మీ వర్షం కురిసింది. అంటే 66.6 లోటు వర్షం నమోదైయింది. అలాగే జులైలో సాధారణ వర్షం 96.7 మి.మీ వర్షంకు గాను 7.1 మి.మీ వర్షంపాతం నమోదైంది. సాధారణంకన్నా 83.7 శాతం లోటు వర్షం నమోదయింది. సీజన్ ప్రారంభమైన కీలకమైన మొదటి రెండు నెలల్లోనే తక్కువ వర్షం కురవడంతో ప్రధాన పంటల సాగుకు అవరోధంగా మారింది,



జిల్లాలో సాగైన ఆరుతడి పంటల సాగు...

పంట	సాధారణ సాగు	సాగైన విస్తీర్ణం హెక్టార్లలో
సజ్జలు	1089	710.0
జొన్న	517	48.08
కొర్ర	1122	11.60
కంది	5,761	285.10
పెసర	260	9.4
మినుము	3,806	1502.92
వేరుశనగ	5,976	983.88
సన్‌ఫ్లవర్	1142	225.70
సోయాబీన్	1030	47.0
ఆముదం	829	23.2
పత్తి	24,036	3524.27

ఇక ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం

ఈ ఖరీఫ్‌లో 77475 హెక్టార్లలో సాధారణ సాగు విస్తీర్ణం అంచనా వేయగా ఇప్పటివరకు 15748.13 హెక్టార్లలో పంటసాగు అయి 20.33 శాతంగా నమోదైయింది. ఈ నెల 15తో వేరుశనగ, సోయాబీన్, మినుము పంటల సాగు చేసుకునేందుకు గడువు ముగిసిందన్నారు. ఆగస్టు 15 తరువాత ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం కంది, పత్తి, ఆముదం, అలసంద పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు.

కనిష్ట స్థాయికి పడిపోయిన వేరుశనగ...

ప్రధాన పంటగా దశాబ్దాల పాటు పేరుగాంచిన వేనుశనగ సాగు ఈ సారి కనిష్ట స్థాయికి పడిపోయింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం సకాలంలో నాణ్యమైన విత్తనాలు ఇవ్వకపోవడం తదితర కారణాలతో వేరుశనగ పంటసాగుకు రైతన్నలు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ ఖరీఫ్‌లో 5976 హెక్టార్లలో అంచనా వేయగా చివరకు 983.88 హెక్టార్ల వద్ద సాగు నిలిచిపోయింది. అలాగే పత్తి పంట సాధారణ సాగు 24,036 హెక్టార్లుకాగా ఇప్పటివరకు 3524.27 హెక్టార్లలో, సోయాబీన్ సాధారణసాగు 1030 హెక్టార్లు కాగా 47 హెక్టార్లలో, మినుము 3806 హెక్టార్లకు గాను 1502 హెక్టార్లలో సాగయ్యాయి. అది కూడా నీటి వసతి కింద సాగు చేశారు.



వీఎన్‌పల్లి ప్రాంతంలో సాగులో ఉన్న వేరుశనగ

గతేడాది మినుము పంట సాగు చేశా



గతేడాది ఈ సమయానికి మినుముపంటను సాగు చేశాను. ఈ ఏడాది జూన్, జులై నెలల్లో వర్షాలు లేమి కారణంగా ఏ పంటను సాగు చేయలేదు. దీంతో భూములు బీళ్లుగానే ఉండిపోయాయి. సరైన వర్షం కురవకపోవడంతో ఏ పంటనూ సాగు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఇక ఏ పంటను సాగు చేసుకోవాలో ఏమో ఆలోచించుకోవాలి.

– వెంకటసుబ్బారెడ్డి, కంచన్నగారిపల్లె, కమలాపురం మండలం

వేరుశనగ, సోయాబీన్, మినుముకు...



ఆరుతడి పంటలకు సంబంధించి వేరుశనగ, సోయాబీన్, పంటల సాగుకు ఆగస్టు 15వ తేదీతో గడువు ముగిసింది. కాకపోతే మినుము పంటను విధిలేని పరిస్థితుల్లో మాత్ర మే సాగు చేసుకోవచ్చు. అలాగే పత్తి, కంది, ఆముదం, అలసంద పంటల సాగుకు ప్రస్తుతం అనుకూలం. రైతుల పరిస్థితులను గమనించి వ్యవసాయ అధికారుల సూచన మేరకు పంటలను సాగు చేసుకోవాలి.

–డాక్టర్ వీరయ్య, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞానకేంద్రం, కడప

దేవునికడప ఆలయ జీర్ణోద్ధరణ పనులు

- బాలాలయ నిర్మాణ పనులు ప్రారంభం
- 20 నుంచి భక్తులకు అందుబాటులోకి..



స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

కడప సెవెన్‌రోడ్స్: దేవునికడప శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయ జీర్ణోద్ధరణ పనులకు తిరుమల–తిరుపతి దేవస్థానం సమయాత్తమైంది. ప్రాచీన ఆలయం కావడంతో ఈ పనులు చేపట్టాలని నిర్ణయించారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి వారు, పద్మావతి అమ్మవారు, ఆండాళ్ అమ్మవారి గర్భాలయాలు, విమాన గోపురాలు, రాజగోపురం మరమ్మతు పనులు చేపడుతున్నారు. దీంతో ఆలయంలో శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌కు బదులుగా బాలాలయంలో స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చనున్నారు. ఈనెల 18వ తేదీ సాయంత్రం అంకురార్పణతో ఈ కార్యక్రమం ప్రారంభమై 20వ తేదీ పూర్ణాహుతితో ముగుస్తుంది. ఆరోజు నుంచి గర్భగుడి ఎదురుగా ఉన్న మండపంలో నిర్మించే బాలాలయంలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకోవచ్చు. భక్తులు తమకు సహకరించాలని ఆలయ అధికారులు కోరారు.



దేవునికడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం

జాతికి ఆదర్శనీయం సర్దార్ గౌతు లచ్చన్న

జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు



సర్దార్ డాక్టర్ గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ డాక్టర్ గౌతు లచ్చన్న జాతికి ఆదర్శనీయమని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు అధ్యక్షతన సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సర్దార్ డాక్టర్ గౌతు లచ్చన్న చేసిన కృషి రాష్ట్రానికే కాకుండా యావత్ భారతావనికే ఆదర్శమని చెప్పవచ్చన్నారు. అట్టడుగు వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన త్యాగం, పోరాటస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సర్దార్ డాక్టర్ గౌతు లచ్చన్న తన చిన్న వయస్సులోనే భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చేరి మహాత్మా గాంధీ నాయకత్వంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం, ఇతర ప్రధాన పోరాటాలలో పాల్గొన్నారని పేర్కొన్నారు. తొలుత డీఆర్వో, సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పులకించిన గండిక్షేత్రం





ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన గండి వీరాంజనేయ స్వామి, ఆలయ ప్రాంగణంలో భక్త జనసందోహం

చక్రాయపేట: పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధి శ్రావణ మాసం నాలుగవ శనివారోత్సవం సందర్భంగా భక్తులతో పులకించిపోయింది. రాయలసీమ వ్యాప్తంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తుల కోసం దాతలు పెద్ద ఎత్తున అన్నదానాలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ పాలకమండలి సభ్యులతో పాటు, ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్సై రంగారావు ఆధ్వర్యంలో పోలీసులు బందో బస్తు నిర్వహించారు. చక్రాయపేట ప్రభుత్వ వైద్యాధికారి వాణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, అర్చకులు కేసరి, రాజారమేష్, రఘు స్వామి, వేదపారాయణం రామ మోహణ శర్మ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. గండి వీరాంజనేయ స్వామిని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వినియోగదారుల ఫోరం కోర్టు జడ్జి జింకా రెడ్డిశేఖర్ తదితర ప్రముఖులు స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

ఎమ్మెల్యే మాధవి తీరు సరికాదు

- జాయింట్ కలెక్టర్‌పై పరుష పదజాలం ఆక్షేపణీయం
- ప్రొటోకాల్ ప్రకారమే ఏర్పాట్లు చేశాం
- వేదికపైకి ఆహ్వానించినా అమర్యాదకరంగా వ్యవహరించడం తగదు
- ఈ సంఘటనపై చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు రెవెన్యూ అధికారుల వినతి



జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌పై గుడ్లురిమి కోపంగా చూస్తున్న ఎమ్మెల్యే మాధవి రెడ్డి (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్: స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా శుక్రవారం కడప పోలీసు పెరేడ్ మైదానంలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిరెడ్డి జిల్లా ఉన్నతాధికారులైన జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తదితర అధికారులతో వ్యవహరించిన తీరుపై రెవెన్యూ అధికారులు భగ్గుమంటున్నారు. ఈ సంఘటనపై తగిన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వర నాయుడు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవన్ చంద్రశేఖర్ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

- స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు, ఇతర వర్గాలకు జిల్లా యంత్రాంగం పోలీసు మైదానం వద్ద తగిన సౌకర్యాలు కల్పించిందన్నారు. పండుగ వాతావరణంలో స్వాతంత్ర్య దిన వేడుకలు జరుగుతున్న సమయంలో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఒకటిన్నర గంట ఆలస్యంగా అక్కడికి వచ్చారని పేర్కొన్నారు. ప్రొటోకాల్ ప్రకారం మంత్రి, కలెక్టర్, ఎస్పీ మాత్రమే వేదికపై ఆశీనులు అవుతారన్నారు. ప్రజాప్రతినిధుల కోసం వేదిక పక్కన వీఐపీ గ్యాలరీని ఏర్పాటు చేశామన్నారు. కాగా, ఎమ్మెల్యే మాధవి రెడ్డి కార్యక్రమానికి ఆలస్యంగా రావడంతో పాటు.. ఆలస్యంగా వచ్చే విషయాన్ని కనీసం ముందస్తుగా తమ వ్యక్తిగత సహాయకుల ద్వారానైనా అధికారులకు తెలియజేయలేదన్నారు. అప్పటికే ఎమ్మెల్యేకు కేటాయించిన సీటులో ఇతరులు కూర్చొన్నారని తెలిపారు. దీన్ని గుర్తించిన అధికారులు వెంటనే కూర్చొన్న వారిని అక్కడి నుంచి పంపివేసి ఎమ్మెల్యేను ఆహ్వానించారన్నారు. ఎమ్మెల్యే మాధవీ అక్కడ కూర్చొనేందుకు విముఖత చూపారన్నారు. దీంతో వేదికపై ప్రత్యేకంగా కుర్చీని సమకూర్చి ఆహ్వానించామన్నారు. ముందుగానే వేదికపై కుర్చీ వేయలేదని ఆమె అసహనం వ్యక్తం చేయడంతో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ స్వయంగా వెళ్లి వేదికపైకి రావాలంటూ ఆహ్వానించినా ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పరుషంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం నుంచి సివిల్ సర్వీసెస్ సాధించి జిల్లా ప్రజలకు సేవలు అందించేందుకు వచ్చిన జాయింట్ కలెక్టర్‌పై ఎమ్మెల్యే అమర్యాదకరంగా ప్రవర్తించడం జిల్లాకే అవమానకరమని వాపోయారు. ఎమ్మెల్యేతోపాటు అక్కడికి వచ్చిన అనధికార ప్రజాప్రతినిధి కూడా జిల్లా రెవెన్యూ అధికారి పట్ల దురుసుగా ప్రవర్తించడం గర్హనీయమన్నారు. అధికారులను అవమానించే విధంగా ప్రవర్తించడం ఏ విధంగానూ ఆమోదయోగ్యం కాదన్నారు. స్వయంగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వెళ్లి వేదికపైకి రావాలంటూ ఎమ్మెల్యేను ఆహ్వానించినప్పటికీ ఆమె రాకుండా వెళ్లిపోయిందని తెలిపారు. ఎందరో మహానుభావుల త్యాగాలను స్మరించుకునేందుకు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో పాల్గొని ఆస్వాదించే బదులు తనకు కుర్చీ వేయలేదంటూ అధికారులపై రుసరుసలాడటం అత్యంత హేయమని దుయ్యబట్టారు. జిల్లా అధికారులనే ఆమె దురుసుగా మాట్లాడుతోందంటే ఇక కిందిస్థాయి అధికారులపై ఆమె ప్రవర్తన ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే దురుసు ప్రవర్తనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సంఘటనపై కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

19న ఆకేపాడుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక



హెలిప్యాడ్ ఏర్పాట్ల పనులను పరిశీలిస్తున్న ఆకేపాటి

రాజంపేట: రాజంపేట మండలంలోని ఆకేపాడుకు ఈనెల 19న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు.ఈనేపథ్యంలో శనివారం హెలీప్యాడ్ ఏర్పాట్లను రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి పరిశీలించారు. రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని నవదంపతులను ఆశీర్వదించనున్నారు.

- వైఎస్ జగన్ రాకకు సంబంధించి హెలిప్యాడ్‌ను ఆకేపాటి పరిశీలించారు.ఆకేపాటి ఎస్టేట్ నుంచి ఒక కిలోమీటర్ దూరంలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రొటోకాల్ విషయంలో శ్రద్ధ తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ప్రొటోకాల్ విధులను సమర్థవంతంగా నిర్వహించడంలో శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా ప్రొటోకాల్ విధులపై సంబంధిత రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు కలిసి సమిష్టిగా పనిచేస్తాయని, ప్రొటోకాల్ విషయంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పని చేయాలని ఆదేశించారు. పంద్రాగస్టు రోజు కడపకు చెందిన ఒక ప్రజా ప్రతినిధి వ్యవహరించి న తీరుపై రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇందుకు కలెక్టర్ శ్రీధర్ స్పందిస్తూ ఈ వ్యవహారంపై రెవెన్యూ సంఘాల విన్నపాలను కూడా పరిశీలిస్తున్నామని వివరించారు.

క్లుప్తంగా

కీచక కరస్పాండెంట్‌ను అరెస్టు చేయాలి



మీడియాతో మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డిని పోక్సో చట్టం కింద అరెస్టు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. శనివారం కడప నగరంలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బద్వేలులోని సృజన పాఠశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు. పిల్లలను పాఠశాలకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయంతో వణికిపోతున్నారన్నారు. తనతో పెట్టుకుంటే అంతు చూస్తానంటూ బెదిరిస్తూ, దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని చెప్పారు.

రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన



వాహనదారులకు జాగ్రత్తలను సూచిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్‌లు నడిపే వారు కచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా, ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్లరాదని, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



పోరుమామిళ్ల : మండలంలోని చల్లగిరిగెల దళితవాడకు చెందిన మాగిపోగు పిచ్చయ్యకు చెందిన ఆవు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పొలంలో మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి ఆవు అక్కడికక్కడే చనిపోయింది. తాను పేదవాడినని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

మాట మార్చి మహిళలను ఏమార్చిన బాబు

- ఉచిత బస్సు పథకాన్ని అన్ని బస్సుల్లో వర్తింపజేయాలి
- లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే అర్హత పేదలకు లేదా..
- పల్లె వెలుగు బస్సులకే పరిమితం చేస్తారా
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయకుండా మాట మార్చి మహిళలను ఏమార్చారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని అమలు చేసినట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందన్నారు. అక్క చెల్లెమ్మలు ఏ బస్సు ఎక్కినా రాష్ట్ర వ్యాప్తంగా తిరగవచ్చని గత ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు ఊరూరా ప్రచారం చేసి ఓట్లు వేయించుకున్నారన్నారు. ప్రస్తుతం ప్రధానంగా మూడు బస్సుల్లోనే ఈ సౌకర్యాన్ని వర్తింపజేశారన్నారు. ఆర్టీసీలో అనేక రకాల బస్సులు ఉన్నా ప్రధానంగా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేశారని, నాన్‌స్టాప్, ఇంద్రా, సూపర్ డీలక్స్, సూపర్ లగ్జరీ తదితర బస్సుల్లో ఎందుకు ఈ పథకాన్ని మినహాయించారన్నారు. పేదలైన మహిళలకు ఈ బస్సుల్లో ఎక్కే అర్హత లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ప్రభుత్వాలను గద్దెను ఎక్కించేది పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన మహిళలే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాత్రి పూట తిరిగే దూర ప్రాంత సర్వీసులకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. నాన్‌స్టాప్ బస్సుల్లో కడపకు వెళ్లాలన్నా ఈ పథకం వర్తించదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11వేల బస్సులు ఉండగా కొన్నింటికే ఈ పథకాన్ని వర్తింపజేశారన్నారు. బస్సుల్లో రద్దీ కారణంగా మహిళలు ఘర్షణ పడే అవకాశం ఉందన్నారు. ఇదేనా స్వాతంత్య్ర దినోత్సవం రోజున మహిళలకు ఇచ్చే కానుక అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ జగన్ 2023లో మంజూరు చేసిన ఆరు కొత్త బస్సులు ప్రొద్దుటూరు డిపోకు వచ్చాయన్నారు. ప్రొద్దుటూరు డిపోకు సంబంధించి రోజు రూ.20లక్షలు ఆదాయం వస్తోందని, ఇందులో మహిళల 30 శాతం ఉందన్నారు. ఈ ప్రకారం రోజు ఒక్కో మహిళకు రూ.5 మాత్రమే ఉచిత బస్సు పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని వివరించారు. నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు చార్జీలు రెండింతలు పెంచి రూ.5 ఉచిత బస్సుకు, రూ.7 గ్యాస్‌కు ఇస్తే సరిపోతుందా అన్నారు. ఈ చేత్తో ఇచ్చి ఆ చేత్తో తీసుకుంటున్నారని జగన్ ప్రభుత్వాన్ని విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు తన రెండు చేతులతోపాటు తనయుడైన లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతులు కలుపుకొని దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల బస్సుల్లో ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో శాంతియుతంగా ఉద్యమాలను చేపడతామన్నారు.

ఉపాధి పీడీపై చర్యలు తీసుకోవాలి



మీడియాతో మాట్లాడుతున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ జాల శివ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉపాధి హామీ పథకం ద్వారా విశేష సేవలు అందిస్తున్న తమను ఇబ్బందులకు గురి చేస్తున్న పీడీపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ జాల శివ కోరారు. ఈ మేరకు అసోసియేషన్ నాయకులు మీడియాతో మాట్లాడారు. గత 19 సంవత్సరాలుగా తాము ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామీణ ప్రజలు వలసలు పోకుండా వారికి ఉపాధి కల్పిస్తూ ఉపాధి హామి పథకానికి వెన్నెముకగా నిలిచామన్నారు. ప్రస్తుత పీడీ అనేక మంది ఫీల్డ్ అసిస్టెంట్ల జీవితాలను రోడ్డు పాలు చేశారన్నారు. జిల్లాలో తొలగించిన వారిలో చాలా వరకు జాబ్‌కార్డుల అంశం సాకుగా చూపారని, అసలు ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ ప్రతినిధులు సుదర్శన్ రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, బయారెడ్డి, వెంకటసుబ్బమ్మ, విష్ణువర్ధన్ రెడ్డి, పీరయ్య, వరద్దిదేవి, విక్టోరియా, మహేశ్వర్‌రెడ్డి, ఓబయ్య, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరా తరహాలో డీటీఈ ఎర్నింగ్ యాప్ క్లోజ్..!

అన్నమయ్య జిల్లాలో వెలుగు చూసిన మరో కొత్త మోసం

కురబలకోట : వీడియో టాస్కులు చూడండి..డబ్బులు సంపాదించండి..స్పిన్ గిఫ్టుతోపాటు వారానికోసారి మనీ విత్ డ్రా అంటూ ప్రచారంలోకి వచ్చిన ఆరా ఎర్నింగ్ యాప్‌తో ఇటీవల వేల మంది మోసపోయారు. ఈ మోసాన్ని మరువక మునుపే ఇదే తరహాలో ఉన్న డీటీఈ ఎర్నింగ్ యాప్ క్లోజ్ అయినట్లు వెలుగులోకి వచ్చింది. మూడు వారాలుగా డబ్బు విత్ డ్రా కాకపోవడంతో మోసపోయినట్లు బాధితులు గుర్తించి నిట్టూరుస్తున్నారు. చెప్పుకుంటే సిగ్గు చేటు అన్నట్లుగా బాధితులు గమ్మున ఉంటున్నారు. ఆరా యాప్ బాధితులు కూడా ఇందులో ఉండడం విశేషం. బాధితుల కథనం మేరకు.. ఆరా తరహాలో ఆరునెలల క్రితం డీటీఈ ఎర్నింగ్ యాప్ ప్రచారంలోకి వచ్చింది. రూ. 2 వేలు డిపాజిట్ చెల్లిస్తే డీవన్, రూ.10 వేలు డిపాజిట్ చెల్లిస్తే డీ టు ఇలా డిపాజిట్‌కు తగ్గట్టుగా ప్లాన్ ప్రకటించారు. డిపాజిట్ చెల్లించి యాడ్స్ చూస్తే అధికంగా డబ్బు వస్తుందని ప్రచారంలోకి వచ్చింది. కొంత కాలం ప్రతి శుక్రవారం విత్ డ్రాల్స్ జరిగాయి. ఆశకుపోయి చాలా మంది చేరారు. అయితే వరుసగా మూడు వారాలుగా విత్ డ్రా కాలేదు. టెక్నికల్ సమస్య అని ఒక వారం , ఆడిట్ జరుగుతోందని ఇంకో వారం నమ్మబలుకుతూ వచ్చారు. ఈ శుక్రవారమైనా వస్తుందని ఆశించారు. తీరా చూస్తే నో డేటా అని యాప్‌లో కన్పించింది. అంతే కాదు రూ. 1380 అదనంగా చెల్లించి ఈకేవైసీ చేసుకుంటే ఐడీ యాక్టివ్ అవుతుందని మెసేజ్ పెట్టారు. యాప్ పనిచేయకపోవడం ఆపై కొత్త నిబంధనలు పెట్టడం విత్ డ్రాల్స్‌ను నిలిపి వేయడంతో ఈజీ మనీ ఆశలు ఆవిరయ్యాయి. దీంతో వరుసగా మూడు శుక్రవారాలు డబ్బులు విత్ డ్రా కాకపోవడంతో మోసపోయినట్లు బాధితులు గుర్తించి ఆశలు వదిలేశారు. ఇలాంటి కేసులు పోలీసులకే సవాల్‌గా మారుతున్నాయి.

నేడు కడపలో ఎంబీబీఎస్ విదేశీ విద్యపై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిహార్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వోక్స్ ఓవర్సీస్ సహకారంతో కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో ఆదివారం ఉదయం ఉదయం 10 గంటలకు ఎంబీబీఎస్ విదేశీ విద్యపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిహార్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ రీజినల్ కోఆర్డినేటర్ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, రష్యా, జార్జియా, ఫిలిప్పైన్స్, ఇటలీ, కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఆర్మేనియా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో ఎంబీబీఎస్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్, హోటల్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తదితర కోర్సులపై నిపుణులు పూర్తి వివరాలు అందిస్తారన్నారు. తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత విద్యను అందించే విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందే విధానం, స్కాలర్‌షిప్ అవకాశాలు, వీసా ప్రాసెస్, కోర్సు ఎంపిక వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారన్నారు. ఇందుకు సంబంధించి వివరాల కోసం 77021 72568 నంబరులో సంప్రదించాలన్నారు.

యువతి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక స్వరాజ్‌నగర్‌లో పల్లోలి పవిత్ర (25) అనే యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని స్వరాజ్‌నగర్‌కు చెందిన పవిత్ర ఎంటెక్ వరకు చదువుకొని రెండేళ్ల క్రితం నుంచి పెద్దశెట్టిపల్లెలోని ఒక ఇంజినీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తోంది. దువ్వూరు మండలంలోని ఇడమడక గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ అనే తమ బంధువుల అబ్బాయిని ఆమె ప్రేమించింది. ఈ విషయం పవిత్ర తల్లి దండ్రులకు తెలియడంతో వారు కూడా కుమార్తె ప్రేమను అంగీకరించారు. వచ్చే ఏడాది ఇరువురికి పెళ్లి చేయాలని పవిత్ర తల్లిదండ్రులు భావించారు. ఎప్పటి లాగే పవిత్ర 15న కళాశాలకు వెళ్లింది. స్వాతంత్య్రదినోత్సవం కావడంతో ఉదయం 10.30 గంటలకే ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటిపై ఉన్న రేకుల షెడ్డు గదిలోకి వెళ్లి కిందికి రాలేదు. రాత్రి 8 గంటల సమయంలో తల్లి జయమ్మ మిద్దెపైకి వెళ్లి గది తలుపు తట్టినా పవిత్ర పలకలేదు. కిటికీలోంచి చూడగా ఆమె రేకుల పైపునకు చీర చుట్టుకొని ఉరికి వేలాడుతూ కనిపించింది. దీంతో బంధువులందరూ తలుపులు పగులకొట్టి ఆమెను కిందికి దిం ఆస్పత్రికి తరలించారు. వైద్యుడు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ప్రేమ వ్యవహారం లేక ఇతర విషయాల్లో మనస్థాపం చెంది తన కూతురు మృతి చెందినట్లు తల్లి జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలి



అంబేద్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎస్.డి విజయ జ్యోతి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ఓటు చోరీపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ద్వారా ప్రజలు ఓటు వేసుకునే హక్కును కోల్పోతున్నారని చెప్పారు. వీరి వైఖరిని వ్యతిరేకిస్తూ లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి అందరూ మద్దతు ఇచ్చి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సయ్యద్ గౌస్ పీర్, ధ్రువ కుమార్ రెడ్డి, శివ మోహన్ రెడ్డి, ఇర్ఫాన్, అలీ ఖాన్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విష పురుగు కుట్టి రైతు మృతి

సిద్దవటం : రైతు వరికి నీరు కడుతుంటే విషపురుగు కుట్టి రైతు మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. సిద్దవటం మండలం వెలుగుపల్లె గ్రామానికి చెందిన రైతు పాజర్ల వెంకటయ్య(45) అలియాస్ పుల్లయ్య శనివారం తన వరి పంటకు నీరు కట్టేందుకు వెళ్లాడు. అక్కడ పొలానికి నీరు కడుతుండగా నీళ్లలో విషపురుగు వెంకటయ్యను కుట్టింది.

ఉచిత బస్సు ఎంతకీ రాదేమీ!



కడప ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం నిరీక్షిస్తూ..,

రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వతేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలు జీరో టికెట్ పొంది ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపింది. కాగా ఆ పథకం ప్రవేశపెట్టిన మరుసటి రోజే బస్టాండులో ఫ్రీ బస్సులేవీ ఎంతకూ రాకపోవడంతో ప్రయాణికులు వేచి చూసి చూసి విసుగు చెందారు. ఉదయం 10.30 గంటల సమయంలో బస్టాండులో అన్నీ అల్ట్రా డీలక్స్ బస్సులు మినహా మిగిలిన బస్సులేవీ కనిపించలేదు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చినప్పుడు అందులో సీట్లు రిజర్వ్ చేసుకోవడానికి కర్చీఫ్‌లు, టవళ్లు వేస్తూ గాబరా పడ్డారు. ఉచిత బస్సు ప్రయాణం మాటేమోగానీ బస్సు వచ్చి, అందులో సీటు దొరికే సరికి ఒంట్లో సత్తువంతా పోయేలా ఉందని సగటు ప్రయాణికులు గొణుక్కున్నారు.

ఫొటోలు –సాక్షి ఫొటోగ్రాఫర్, కడప.



సీటు కోసం తిప్పలు పడుతూ..



ఎక్కేందుకు తోసుకుంటూ..

చేనేతలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్



కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం చేనేతలను మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్ కుమార్ విమర్శించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 5000 మందికి సహకార సంఘాల చేనేత పారిశ్రామికులకు నూలు ఇచ్చి చేనేతలను ఉద్ధరించామని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సొంత మగ్గాల వారికే సుమారు లక్ష మందికి సంవత్సరానికి రూ.24 వేలు నేతన్న నేస్తం పథకం కింద ఇచ్చారని గుర్తు చేశారు. ఇంకా సహకార సంఘాల్లో ఫ్రేమ్ లూమ్స్‌పై నేత నేసే చేనేత పారిశ్రామికులు, మాస్టర్ వీవర్ల మగ్గాల షెడ్లలో నేత నేసే చేనేత పారిశ్రామికులు సుమారు లక్ష మంది ఉంటారని, వారికి కూడా నేతన్న నేస్తం పథకం వర్తింపజేయాలన్నారు. వారు కాక చేనేత అనుబంధ వృత్తులైన రాట్నంపై నూలు వడికే వారు, పాడుగు వార్పు చేసేవారు, అచ్చులు అతికే వారు, నూలుకు రంగులు వేసే వారు మరొక లక్ష మంది దాకా ఉంటారన్నారు. వారి కూడా ఈ పథకం వర్తింపజేయాలని తాము అప్పటి ప్రభుత్వాన్ని కోరామన్నారు. అయితే నేతన్న నేస్తం పథకం రూపొందించడంలో ఉన్న సాంకేతిక కారణాల వల్ల అమలు చేయడం కుదరలేదన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే వారందరికీ నేతన్న నేస్తం పథకం వర్తింపజేసేవారమన్నారు. చేనేత పరిశ్రమలో అన్ని రకాల పారిశ్రామికులు కలిపి సుమారు 4 లక్షల మంది ఉన్నారని, ఇప్పుడు చేనేత కార్మికులు 57 వేల మందికి ఉచిత విద్యుత్ 200 యూనిట్లు, 15వేల మంది మరమగ్గాల వారికి 500 యూనిట్లు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు.

మలబార్ గోల్డ్‌లో 'వ్యానా కలెక్షన్' ఆవిష్కరణ



మలబార్ సంస్థలో ఆభరణాలను ప్రదర్శిస్తున్న యువతులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కోటిరెడ్డి సర్కిల్ స్టోర్‌లో శనివారం వ్యానా కలెక్షన్ ఆవిష్కరించారు. మలబార్ గోల్డ్ విలువైన ఖాతాదారుల కుటుంబ సభ్యులు వజ్రాభరణాలు ధరించి సందడి చేశారు. ఈ సందర్భంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్ హెడ్ లేసస్ సత్యన్ మాట్లాడుతూ వజ్రాభరణాల సేకరణ, ప్రదర్శనలో పాల్గొనడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి మహిళ ప్రత్యేకతను చాటేలా జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. సొగసైన కలెక్షన్‌లతోపాటు అద్భుతమైన రత్నాలు, అన్‌కట్ వజ్రాలతో కూడిన సాంప్రదాయ ఆభరణాలు లభిస్తాయని తెలిపారు. అన్ని ఆభరణాల తరుగు ఛార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు ఉంటుందన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్ సెప్టెంబర్ 7 వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఆధునిక మహిళలకు సరైన ఆభరణాలు ఉన్నాయని, మలబార్ స్టోర్‌ను సందర్శించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ స్టోర్ మార్కెటింగ్ డిప్యూటీ మేనేజర్ ఇషాక్ బాషా, స్టోర్ మేనేజర్ నరేంద్ర కుమార్, కడప మేనేజ్‌మెంట్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న వీఆర్‌ఏ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బందిగి సాహెబ్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్‌ఏలకు గత ఏడు సంవత్సరాలుగా జీతాలు పెంచలేదని, వెంటనే జీతాలు పెంచకపోతే ఉద్యమం చేపడతామని వీఆర్‌ఏ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బందిగి సాహెబ్ హెచ్చరించారు. శనివారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో వీఆర్‌ఏల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఒకటిన్నర సంవత్సరం అయినప్పటికీ వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఎలకు డీఏలు, వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల సాధనకు ఈ నెలాఖరులో రాష్ట్ర వ్యాప్తంగా రిలే దీక్షలు, చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 18వ తేదీ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు. 19, 20 తేదీల్లో మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వీఆర్‌ఏ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, జిల్లా కోశాధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



హబీబుల్లా(ఫైల్)



ఎస్‌ఐ ఆధ్వర్యంలో వెలికి తీసిన మృతదేహం

అట్లూరు : సరదా కోసం ఆలయ ప్రాంగణంలోని నీటి గుండంలో ఈత కొట్టేందుకు దిగి గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని ఎట్టకేలకు ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది శనివారం వెలికి తీశారు. ఎస్‌ఐ కథనం మేరకు మైదుకూరు పట్టణంలోని బద్వేలు రోడ్డులో ఉన్న మహబూబ్‌నగర్‌కు చెందిన ఏడుగురు మాంసం దుకాణంలో పనిచేసేవారు, ఒక ఆటో మెకానిక్ హబీబుల్లా (36) మొత్తం 8 మంది ఆటోలో శుక్రవారం శ్రీలంకమల్లేశ్వర అభయారణ్యంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చారు. ఆలయ ప్రాంగణంలో స్నానపు గుండంలో దిగారు. అందరూ సరదాగా ఈత కొట్టి ముందుగా నలుగురు ఒడ్డుకు వచ్చారు. మిగిలిన నలుగురిలో ముగ్గురు మాత్రమే బయటికి రాగా హబీబుల్లా గల్లంతయ్యాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు బద్వేలు ఫైర్ సిబ్బందితో వెళ్లి శుక్రవారం పొద్దుపోయే వరకూ గాలించారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించలేదు. తిరిగి శనివారం ఉదయం ఫైర్ సిబ్బందితో కలసి వెళ్లి హబీబుల్లా మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ రైటర్ నాగేశ్వర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు సుబ్బరాయుడు, శ్రీను, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బార్లకు టెండర్‌లో పాల్గొనం



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ జయరాజుకు సమస్యను వివరిస్తున్న బార్ల యజమానులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన మద్యం బార్ల విధానం అమలు వల్ల బార్లు ఏర్పాటు చేసుకునే వ్యాపారులు తీవ్రంగా నష్టపోవడం తప్పదని పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజును కలిసి బార్ల యజమానులు తమ సమస్యను విన్నవించారు. మద్యం షాపుల్లో 200 రూపాయలు ఎంఆర్‌పీ ఉండే మద్యం సీసా బార్లలో రూ.210 కి ఇస్తారన్నారు. నూతన మద్యం పాలసీతో మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూములు ఇవ్వడంతో బార్ల వ్యాపారం పడిపోతుందన్నారు. ప్రస్తుతం మద్యం బార్ల పాలసీలలో గోడౌన్ నుండి సరుకు షాపుల కంటే 15 శాతం అదనంగా భారం పడుతుందన్నారు. నెలసరి ఆదాయం సుమారు రూ.15 లక్షల నష్టం వస్తుందని చెప్పారు. గతంలో 20 శాతం మార్జిన్ అని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు 13 శాతమే వస్తుందన్నారు. ఎవరు కూడా బార్లకు దరఖాస్తు వేయకూడదని నిర్ణయించామన్నారు.

నేడు మెగా గ్రాండ్ స్కాలర్‌షిప్ టెస్ట్

ప్రొద్దుటూరు : స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు మెగా గ్రాండ్ స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ కె.సృజన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తయిన, చదువుతున్న విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలైన బ్యాంక్స్, రైల్వే, ఎస్ఎస్‌సీ, ఫారెస్ట్, గ్రూప్స్, డీఎస్సీ పరీక్షల సిలబస్, ప్రామాణిక మెటీరియల్‌పై అవగాహన కోసం నమూనా పరీక్ష నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన వారికి మొదటి బహుమతి రూ.3 వేలు, ఆరు నెలల పాటు నెలకు రూ.1000 చొప్పున స్కాలర్ షిప్ అందిస్తామని, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, నెలకు రూ.500 చొప్పున ఆరు నెలలపాటు స్కారల్ షిప్ అందిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8099919877 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.